క్లుప్తంగా

నేటి నుంచి గోట్లపల్లి జాతర



మూలవిరాట్లు

పెద్దేముల్: మండలంలోని గోట్లపల్లి శివాలయ జాతర శనివారం నుంచి ప్రారంభం కానుందని ఆలయ ధర్మకర్త మల్లప్ప స్వామి శుక్రవారం తెలిపారు. 11వ తేదీ ఉదయం 10 గంటలకు రుద్రాభిషేకం, నవగ్రహ పూజ, హోమం, హన్మండ్ల చంద్రం పూజ, మధ్యాహ్నం 3గంటలకు పార్వతి పరమేశ్వరుల గంగస్నానం. 12వ తేదీ ఉదయం 6గంటలకు అగ్నిగుండం, అభిషేకం, 9గంటలకు బోనాలు, 11.30 నిమిషాలకు శివపార్వతుల కల్యాణ వేడుక ఉంటుందని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పనుల్లో వేగం పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: మన ఊరు – మనబడి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంఈవో హబీబ్ అహ్మద్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అంతారం గ్రామంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం హన్మంతు, సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

పుస్తెమెట్టల అందజేత



యువతి కుటుంబ సభ్యులకు పుస్తెమెట్టలు అందజేస్తున్న సంపత్‌కుమార్

తాండూరు రూరల్: పేదింటి యువతి వివాహానికి డాక్టర్ సంపత్ కుమార్ పుస్తె మెట్టలు అందజేశారు. మండలంలోని మల్కాపూర్‌కు చెందిన కల్లూరు అంజిలయ్య కూతురు రేణుక పెళ్లి శుక్రవారం జరిగింది. బాలాజీ వెంకట గోపాల్(బీవీజీ) ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్ కుమార్ పెళ్లి కూతురు రేణుక కుటుంబ సభ్యులకు పుస్తెమెట్టలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవిసింధే, గని కార్మిక సంఘం మాజీ చైర్మన్ పండరి, నాయకులు హసేన్ పటేల్, మల్లప్ప, కిష్టప్ప, వెంకట్, చందు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోండి

అనంతగిరి/దోమ: వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వహీదా ఖాతుం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ధరణి సమస్యలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రతి సోమవారం..

దోమ: ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షాహెదాబేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. రైతులు తమ వద్ద గల రెవెన్యూ వివరాలతో సమస్యల పరిష్కారం కోసం రావాలని సూచించారు.

విద్యార్థి దశ నుంచే ఉత్తమ ఆలోచనలు అవసరం



విద్యార్థులకు సూచనలు చేస్తున్న కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి

కుల్కచర్ల: విద్యార్థి దశ నుంచే ఉత్తమమైన ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని కులకచర్ల కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి సూచించారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులకు మానవ సంబంధాలు, ఆలోచన విధానాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ చిన్నతనం నుంచి సమాజంలో జరుగుతున్న మంచి చెడుల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. తద్వార మనం పాటించాల్సిన పద్ధతులు తెలుస్తాయన్నారు. మన ఆలోచన విధానాల ద్వారానే మన ప్రవర్తన, క్రమశిక్షణ ఉత్తమమైన మార్గం వైపు పయనించేలా చేస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



అమ్మవారి సేవలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, నాయకులు



పోలెపల్లి జాతరలో జన సందోహం

వైభవంగా సిరిమానోత్సవం

'ఎల్లమ్మ మాతకు జై.. మావురాల తల్లి మమ్ము కాపాడమ్మా.. పోలెపల్లి తల్లీ సల్లంగా చూడమ్మా'.. అంటూ భక్తుల హోరెత్తించారు. డప్పుల మోతలు.. బైండ్లవారి జమిడీక, గొల్లకుర్మల డోలు శబ్దాలతో శుక్రవారం సాయంత్రం పోలేపల్లి ఎల్లమ్మ సిరిమానోత్సవం మార్మోగింది. శివసత్తులు పూనకాలతో జాతర ప్రాంగణం ఊగిపోయింది. అంగరంగ వైభవంగా సాగిన సిడె ఉత్సవాన్ని వేలాది మంది భక్తులు తిలకించి తరించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– బొంరాస్‌పేట



సిడెను పూలతో అలంకరిస్తున్న భక్తజనం

మహిళల రక్షణకే షీటీం



షీటీం సేవలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న నర్సింహులు

పరిగి: మహిళల రక్షణ కోసమే షీటీం పనిచేస్తుందని షీటీం ఇన్‌చార్జ్ నర్సింహులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాపోల్ ఉన్నత పాఠశాలలో షీటీం సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించేందుకు షీటీం హెల్ప్‌లైన్ నంబర్ 181ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కడైన మహిళలపై ర్యాగింగ్, దాడులు జరిగితే వెంటనే డయల్ 100, లేదా 181కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ బాల్యవివాహాలు జరుగుతూనే ఉన్నాయని, వాటిని అరికట్టాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొంత మంది కేటుగాళ్లు గ్రామీణ ప్రాంత అమాయక ప్రజలను టార్గెట్ చేసి బ్యాంకింగ్ మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు దుప్పట్ల పంపిణీ



చిన్నారులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దశరథ్

పరిగి: పట్టణంలోని బాలసదనంలో గల అనాథ పిల్లలకు దుప్పట్లను పంపిణీ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం బాలసదనంలోని 15 చిన్నారులకు దుప్పట్లను పంపిణీ చేశారు. తల్లిదండ్రులు లేని పిల్లలు అనాథ పిల్లలు కారని వారికి కుటుంబ సభ్యులు లేని లోటు తీర్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదాయం ఉన్నవారు ఇలాంటి పిల్లల కోసం కొంత సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీడీఓ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న కౌన్సిలర్ సంగీత ఠాకూర్

కౌన్సిలర్ సంగీత ఠాకూర్

తాండూరు టౌన్: పేదల కోసం సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని 20వ వార్డు కౌన్సిలర్ సంగీత ఠాకూర్ అన్నారు. శుక్రవారం వార్డు పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. పేదల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న షాదీముబారక్, కల్యాణలక్ష్మి, రైతుబంధు, దళిత బంధు తదితర పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. అంధత్వ నివారణ కోసం అందుబాటులోకి తెచ్చిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షల అనంతరం ఉచితంగా మందులు, కళ్లద్దాలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే కంటి ఆపరేషన్ కూడా ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. కంటి పరీక్షల కోసం వచ్చే వారు ఆధార్‌కార్డు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఝాన్సీ, అరుంధతి, సూపర్‌వైజర్ అంబిక, ఏఎన్ఎంలు సుమలత, మాధవి, అంగన్‌వాడీ టీచర్ రాధ, ఆర్పీ శోభ, ఉపాధ్యాయులు మాధవి, రాణి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రవిగౌడ్, సిబ్బంది

కొడంగల్ రూరల్: వాహనచోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ రవిగౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని చిట్లపల్లి గేటు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్ఐ బాలకిషన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంగారంలో కార్డన్‌సెర్చ్



వాహన రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం గంగారంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీలు చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని 20 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పాత్ర ఎంతో కీలకమన్నారు. కాలనీల్లో ఎవరైన అనుమానాస్పందగా తిరిగే వారిపై నిఘా పెట్టాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్



షాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

షాబాద్: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ ఎంవీ మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంజర్ల ప్రకాశ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్, పోలింగ్ బూత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌లా, శక్తికేంద్రాల పనితీరుని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల్లో 11 వేల సభలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను మరిచి అన్ని వర్గాల వారిని మోసం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, అసెంబ్లీ ఇంచార్జీ ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, చేవెళ్ల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, శంకర్‌పల్లి బఅధ్యక్షుడు రాములు, బీర్ల సురేశ్, రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, ప్రధాన కార్యదర్శులు సురేశ్, హరీష్, యువమోర్చా జిల్లా కార్యదర్శి మహేందర్ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పర్వేద గ్రామంలో నిర్వహించిన సీతారాములు కల్యాణ సహిత, నవగ్రహ, గ్రామనాభి శిరి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనితా, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, గుడిమల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, చేవెళ్ల, శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, గోపాల్, మండల బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంగమేశ్వర ఆలయ వేడుకలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



పూజలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

- పాల్గొన్న ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రోహిత్‌రెడ్డి
- భారీగా తరలివచ్చిన భక్త జనం

నవాబుపేట: మండలంలోని మాదిరెడ్డిపల్లిలో ఇటీవల నిర్మించిన సంగమేశ్వరస్వామి ఆలయ, గణపతి, భ్రమరాంబికాదేవి, కుమారస్వామి, నవగ్రహ, నాభిశిలా, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు మూడో రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భారీగా భక్తుల తరలిరావడంతో గ్రామం జనసంద్రమైంది. వేడుకల్లో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రోహిత్‌రెడ్డి, ఎంపీపీ భవాణి, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, సర్పంచ్ తలారి యశోద, ఎంపీటీసీ విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, తలారి ప్రభాకర్, భుజంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

కుల్కచర్ల: మండలంలోని ముక్తవెంకటాపూర్‌లో కాళీమాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఫీర్జాదిగూడ కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు మంచి అనుభూతిని ఇవ్వడంతో పాటుగా మన ఆచార సంప్రదాయాలు పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో లంబాడి ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు విస్లావత్ రమేష్ నాయక్, నాయకులు జరుప్ల శ్రీనునాయక్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండలం మల్కాపూర్‌లో కొనసాగుతున్న శివాలయ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగరాజు, మేగ్యా నాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

దోమ: మండలంలోని రాకొండ గ్రామంలో శివ స్వాములు శుక్రవారం మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. పార్వతి పరమేశ్వరులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు. మండల కేంద్రంలో కొల్లురు శేఖర్ ఏర్పాటు చేసిన శివ స్వాముల పూజకు బీజేపీ పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మిట్ట పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, పరిగి అసెంబ్లీ కన్వీనర్ నర్సింహ ముదిరాజ్, బీజేపీ పరిగి, దోమ మండలాల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పట్లూర్‌లో..

మర్పల్లి: మండలంలోని పట్లూర్‌లో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం ఆలయంలో వేద పండితుల సమక్షంలో హోమం నిర్వహించారు. విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఆలయ అభివృద్ధికి మర్పల్లి జెడ్పీటీసీ పట్నే మధుకర్ లక్షా నూటపదహారు రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ ఇందిర, మాజీ సర్పంచ్ సురేష్, ఎంపీటీసీలు స్వప్న, మంజుల, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు అశోక్, పార్టీ సీనియర్ నాయకుడు రవి, బీఆర్ఎస్ మర్పల్లి టౌన్ ప్రసిడెంట్ గౌస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్లూర్ వినాయక సమితి వారు రూ. 35 వేలు విరాళం అందజేశారు.

ఫార్మసీ కళాశాలలు ఏర్పాటు చేయాలి: నాగేశ్వర్

వికారాబాద్ అర్బన్/పరిగి: ఫార్మసీ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అవసరమని తెలంగాణ రిజిస్టర్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముకుంద నాగేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్య, నర్సింగ్ కళాశాలలకు అనుబంధంగా ఫార్మసీ కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఫార్మసీ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, గురుకులాల్లో ఫార్మసీ టీచర్లను నియమించాలన్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు

కుల్కచర్ల: గర్భిణులు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా శిశువు ఆరోగ్యంగా ఉంటాడని మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్ర ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 42మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ. 2వేల విలువ చేసే పౌష్టికాహారాన్ని కిట్ రూపంలో అందజేస్తోందని తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం

కుల్కచర్ల: సహకార సంఘంలో సభ్యత్వం ఉండి మృతి చెందిన రైతు అంత్యక్రియలకు రూ. 9వేలు అందజేయడం జరుగుతుందని పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తిర్మలాపూర్‌కు చెందిన షాబాద్ అంజిలయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న సహకార సంఘం అధికారులు రైతు ఇంటికి వెళ్లి రూ. 9వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులందరికీ సంఘం అండగా ఉంటుందన్నారు.

పేదలను ఆదుకోవడం హర్షణీయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

దోమ: గ్రామాల్లో నిరుపేదలకు అండగా నిలవడం గొప్ప విషయమని దోర్నాల్‌పల్లి ఉపసర్పంచ్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం దోర్నాల్‌పల్లి తండాలో బీమ్లా నాయక్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఎమ్మార్ ట్రస్ట్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకన్న, గ్రామస్తులు వస్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

పరిగి: మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 12వ తేదీ నుంచి పరిగి బస్టాండ్ నుంచి శ్రీశైల పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డీఎం పవిత్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు బస్సు నడపనున్నట్టు తెలిపారు. అంతే కాకుండా ప్రతి నెలా 6వ తేదీ తిరుపతికి ప్రత్యేక బస్సు నడపనున్నట్టు తెలిపారు. తిరుపతికి వెళ్లే ప్రయాణికులు 20వ తేదీలోగా సెల్ నంబర్ 7382839193, 9959225253లో సంప్రదించి టికెట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

ఫ్లెక్సీలు తొలగించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామంలోని ముఖ్యకూడలిలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి అడ్డుగా ఉన్న బీఆర్ఎస్ ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ముఖ్యకూడలిలో సంక్రాంతి పండుగ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు స్వర్గీయ ఇందిరాగాంధీ విగ్రహం కనిపించకుండా అడ్డంగా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. ఫ్లెక్సీ ఏర్పాటు చేసి సుమారు నెలరోజులు కావస్తున్నా ఇంకా తొలగించలేదని చెప్పారు. ఇందిరాగాంధీ విగ్రహానికి అడ్డుగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీని తొలగించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కాటసుధీర్, మండల అధ్యక్షుడు మహేష్‌గౌడ్, జిల్లా కార్యదర్శి వంశీ, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ యాదవ్, కార్యదర్శి ఉదయ్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు జిజోజాన్సన్, కేశంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివగౌడ్ పాల్గొన్నారు.